క్లుప్తంగా

గుర్తు తెలియని మృతదేహం లభ్యం



ములకలచెరువు : మండలంలోని సోంపల్లె పంచాయతీ చిటిమిరెడ్డిగారిపల్లె సమీపంలోని వేపల బీడు అటవీ ప్రాంతంలో గుర్తుతెలియని మృతదేహాన్ని గురువారం స్థానికులు గుర్తించి ఎస్‌ఐ తిప్పేస్వామికి సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చేరుకొన్న ఎస్‌ఐ మృతదేహాన్ని పరిశీలించారు. సుమారు 50 ఏళ్ల వయస్సు ఉంటుందని చెప్పారు. కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. ఆచూకీ తెలిస్తే 9440900715 నంబరులో సంప్రదించాలని ఎస్‌ఐ కోరారు.

వృద్ధురాలు అదృశ్యం



గంగులమ్మ (ఫైల్)

మదనపల్లె : వృద్ధురాలి అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్ సీఐ వలీబాషు తెలిపారు.పట్టణంలోని శేషమహల్ థియేటర్ సమీపంలో నివసిస్తున్న రామకృష్ణారెడ్డి భార్య గంగులమ్మ (73) మంగళవారం మధ్యాహ్నం నుంచి కనిపించకుండా పోయింది. ఆమెకు మతిస్థిమితం సరిగా లేదని కుటుంబ సభ్యులు వన్ టౌన్ పోలీస్ స్టేషన్ లో బుధవారం రాత్రి ఫిర్యాదు చేశారు. ఆ మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. ఆచూకీ తెలిసినవారు 9440796739 నంబర్‌కు సమాచారం అందించాలని కోరారు.

వైఎస్సార్‌సీపీలోకి వందలాది కుటుంబాలు

ఎన్నికలు సమీపిస్తుండటంతో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలోకి చేరికల ప్రవాహం కూడా జోరందుకుంది. గురువారం వైఎస్సార్ జిల్లాలో ఎంపీ, ఎమ్మెల్యేల సమక్షంలో వందలాది కుటుంబాలు పార్టీలో చేరాయి.

ప్రొద్దుటూరు : ప్రొద్దుటూరు మండల పరిధిలోని అమృతానగర్‌లో వంద కుటుంబాలు గురువారం ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి మాట్లాడుతూ జగనన్న పాలనకు ఆకర్షితులై స్వచ్ఛందంగా అనేక మంది పా ర్టీలో చేరుతున్నారన్నారు. డ్వాక్రా రుణమాఫీ, చేనేత కార్మికులకు ఏటా రూ.24వేలు, అమ్మ ఒడి, బార్బర్ షాపులకు ఉచిత విద్యుత్ లాంటి ఎన్నో పథకాలను పేద, మధ్యతరగతి వారి కోసం ప్రభుత్వం అమలు చేసిందన్నారు. కరోనా సమయంలో తాను నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండి సేవలు అందించానని తెలిపారు.టీడీపీ నాయకులు ఎక్కడ దాక్కున్నారో అర్థం కాలేదని తెలిపారు. వలంటీర్ల ద్వారా ప్రభుత్వం ప్రతి నెలా పింఛన్ అందిస్తుండగా ఉద్దేశ పూర్వకంగా ఫిర్యాదు చేసి పింఛన్ ఇవ్వకుండా నిలిపేశారన్నారు. ప్రస్తుతం పింఛన్ తీసుకోవాలంటే అవస్థలు పడుతున్నారన్నారు. ఎంపీపీ సానబోయిన శేఖర్ యాదవ్, మున్సిపల్ వైస్ చైర్మన్ పాతకోట బంగారు మునిరెడ్డి మాట్లాడుతూ నాడు వైఎస్, నేడు జగన్ ప్రభుత్వంలోనే అమృతానగర్ అభివృద్ధి చెందిందన్నారు. మీరు ఇచ్చిన పదవిని సర్పంచ్ శివచంద్రారెడ్డి రూ.2.50 కోట్లకు అమ్ముకున్నాడని తెలిపారు. మహబూబ్ బాషా, సుభాన్, ఇర్ఫాన్, నిసార్, సలీం, షరీఫ్, వల్లితోపాటు మాజీ వార్డు మెంబర్ సుబ్బరాయుడు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి పోరెడ్డి నరసింహారెడ్డి, కౌన్సిలర్ వరికూటి ఓబుళరెడ్డి పాల్గొన్నారు.



మొయిళ్ల చెరువు: పార్టీలో చేరిన వారితో ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి

వీరపునాయునిపల్లె మండలంలో..

వీరపునాయునిపల్లె : మండలంలోని మొయిళ్ల చెరువు గ్రామంలో గురువారం కమలాపురం పట్టణానికి చెందిన ప్రజా నాయకుడు సాయినాథ్‌శర్మ ఆధ్వర్యంలో కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి సమక్షంలో 60కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరారు. వీరికి ఎంపీ అవినాష్‌రెడ్డి పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. శ్రీనివాసులురెడ్డి, రామకృష్ణారెడ్డి, హరికృష్ణారెడ్డి, సిద్దేశ్వర్‌రెడ్డి, వెంకటరెడ్డి, శ్రీరామిరెడ్డి, గోపాల్‌రెడ్డి, తిరుమలరెడ్డి, సాయిక్రిష్ణారెడ్డితో పాటు మరో 40 కుటుంబాలు పార్టీలో చేరారు. రాష్ట్ర మైనింగ్ డైరెక్టర్ వీరప్రతాప్‌రెడ్డి, ఎంపీపీ రఘునాథ్‌రెడ్డి, సర్పంచ్ వెంకటరెడ్డి పాల్గొన్నారు.

వల్లూరు మండలంలో..

వల్లూరు : మండలంలోని గోటూరు గ్రామంలో 15 కుటుంబాలు టీడీపీ నుంచి వైఎస్‌ఆర్‌సీపీలో చేరాయి. గోటూరు గ్రామ పంచాయతీ పరిధిలో బుధవారం నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో గోటూరుకు చెందిన చావలి లక్షుమయ్య, సురేష్, రవి శంకర్, లీలావతి, ఎస్సీ కాలనీకి చెందిన అట్లూరి సుబ్బయ్య, నాగ సుబ్బయ్య, సుబాష్, సుధాకర్, రాముడు, అంజనమ్మ, అయవారమ్మ, లక్షుమ్మ, గంగమ్మ తదితరులతో బాటు పలు కుటుంబాలు వైఎస్‌ఆర్‌సీపీ తీర్థం పుచ్చుకున్నాయి. ఈ మేరకు ఎమ్మెల్యే పీ రవీంద్రనాథరెడ్డి, ఏపీఎస్ ఆర్‌టీసీ చైర్మన్ అబ్బిరెడ్డి మల్లికార్జునరెడ్డి వారికి వైఎస్‌ఆర్‌సీపీ కండువాలను కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. పార్టీ మండల కన్వీనర్ అబ్బిరెడ్డి వీరారెడ్డి, స్థానిక నేతలు శివకుమార్ రెడ్డి, రామ క్రిష్ణారెడ్డి, నాగ సుబ్బారెడ్డి, నిత్యానందరెడ్డి, రామాంజనేయరెడ్డి పాల్గొన్నారు.



ప్రొద్దుటూరు: మాట్లాడుతున్న మున్సిపల్ వైస్ చైర్మన్ పాతకోట బంగారు మునిరెడ్డి, పక్కన ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి



వల్లూరుమండలం గోటూరులో పార్టీలో చేరినవారితో ఎమ్మెల్యే రవీంద్రనాథరెడ్డి, ఆర్టీసీ చైర్మన్ అబ్బిరెడ్డి మల్లికార్జునరెడ్డి

ఘర్షణలో ఇద్దరికి గాయాలు



గాయపడిన జాఫర్

రాయచోటి టౌన్ : ఇరువర్గాల మధ్య గురువారంజరిగిన ఘర్షణలో ఇద్దరికి గాయాలయ్యాయి. పోలీసుల కథనం మేరకు వివరాలు.. రాయచోటి – గున్నికుంట్ల రోడ్డులోని ఎస్సీ బంగ్లా సర్కిల్ సమీపంలోని 374/4ఏలోని స్థల వివాదం కోర్టులో ఉంది. అయితే పల్లపు రామాంజనేయులు ఆస్థలంలో పునాది వేసే ప్రయత్నం చేశాడు. అదే సమయానికి జాఫర్ అనే వ్యక్తి వచ్చి ఈ స్థలం కోర్టులో ఉందని ఇక్కడ పునాది వేయరాదని చెప్పాడు. ఈ సందర్భంలో వీరి మధ్య మాట మాట పెరిగింది రాళ్లు, కర్రలతో దాడులకు పాల్పడ్డారు. దీంతో ఇద్దరు గాయపడ్డారు. వీరిని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం కడపకు రెఫర్ చేశారు.

చెట్టుపై నుంచి పడి..



గాయపడిన చలపతి

నిమ్మనపల్లె : చెట్టుపై నుంచి పడి ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడిన సంఘటన గురువారం మండలంలో జరిగింది. తవళం గ్రామానికి చెందిన వెంకటరమణ కుమారుడు చలపతి (48), చింతకాయలు కోసేందుకు చెట్టు ఎక్కాడు. ప్రమాదవశాత్తు చెట్టుపై నుంచి జారి కిందపడి తీవ్రంగా గాయపడ్డాడు. గమనించిన స్థానికులు, కుటుంబ సభ్యులు బాధితుడిని మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి తరలించారు.

బైక్, కారు ఢీ

– ముగ్గురికి తీవ్ర గాయాలు

మదనపల్లె : జాతరకు వెళుతూ రోడ్డు ప్రమాదంలో ముగ్గురు వ్యక్తులు తీవ్రంగా గాయపడిన సంఘటన బుధవారం రాత్రి పుంగనూరు మండలంలో జరిగింది. నిమ్మన పల్లె మండలం వెంగంవారి పల్లె పంచాయతీ కొండసానివారి పల్లెకు చెందిన సి.వెంకటరమణ కుమారుడు సి.రెడ్డప్ప (25), అతని భార్య సి. తేజు(20) ఇద్దరూ కలిసి అత్తవారిళ్లయిన పుంగనూరు మండలం కామాటంపల్లికి వెళ్లారు. రాత్రి 8 గంటలకు రెడ్డప్ప, తేజు ద్విచక్ర వాహనంలో పుంగనూరు జాతర చూసేందుకు బయలుదేరారు. బంధువైన మైనర్ బాలిక కె.స్వప్న (16)ను వెంటబెట్టుకుని ద్విచక్ర వాహనంలో వెళ్లారు. మార్గ మధ్యంలో వీరి ద్విచక్ర వాహనాన్ని ఎదురుగా వచ్చిన కారు ఢీకొనడంతో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. గమనించిన స్థానికులు బాధితులను మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి తరలించారు. స్వప్న పరిస్థితి విషమంగా ఉండడం, రెడ్డప్ప తేజు లకు తీవ్ర గాయాలు కావడంతో మెరుగైన వైద్యం కోసం వారిని తిరుపతికి రెఫర్ చేశారు. పుంగనూరు పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.

కన్నతల్లిని కొట్టిన కుమారుడు



గాయపడిన గోపెమ్మ

మదనపల్లె : తనను పోషించకుండా నిర్లక్ష్యం చేస్తున్నారంటూ కన్నతల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడమే ఆమె పాలిట నేరమై కన్నతల్లిని కుమారుడు చితకబాదిన సంఘటన గురువారం మదనపల్లె లో జరిగింది. పట్టణంలోని మాయాబజార్ వీధికి చెందిన చిన్నప్ప భార్య గోపెమ్మ (67) ల కుమారుడు సురేష్ జులాయిగా మారాడు. తండ్రి చిన్నప్ప రిటైర్డ్ ఉద్యోగి కావడంతో తండ్రిని తన వద్ద ఉంచుకొని, ఆయన పెన్షన్ డబ్బులతో జల్సాలు చేస్తూ, తల్లి గోపెమ్మను పోషించకుండా నిర్లక్ష్యం చేశాడు. ఇదే విషయమై బుధవారం గోపెమ్మ టూ టౌన్ పోలీస్ స్టేషన్ కు చేరుకుని తన కుమారుడు తనను పోషించకుండా నిర్లక్ష్యం చేస్తున్నాడని ఫిర్యాదు చేసింది. ఈ విషయం తెలుసుకున్న కుమారుడు సురేష్ ఇంటి వద్ద హార్పిక్ తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. వెంటనే స్థానికులు ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. కన్నబిడ్డ ఆత్మహత్యయత్నానికి పాల్పడడంతో జాలి పడిన తల్లి గురువారం స్టేషన్ కు వెళ్లి ఫిర్యాదు వెనక్కు తీసుకుంది. ఈ విషయం తెలుసుకున్న సురేష్ హాస్పిటల్ నుంచి నేరుగా తల్లి ఉంటున్న చోటుకు వెళ్లి ఆమెపై దాడి చేసి చితకబాదాడు. ఈ దాడిలో ఆమె గాయపడడంతో స్థానికులు ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి తరలించారు. స్థానిక వైద్యులు చికిత్సలు అందించారు.

ఇద్దరు ఆత్మహత్యాయత్నం

మదనపల్లె : వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరు మహిళలు ఆత్మహత్యాయత్నానికి పాల్పడి స్థానిక ప్రభుత్వ జిల్లా ఆసుపత్రిలో చికిత్సలు పొందుతున్నారు. పట్టణంలోని ఈశ్వరమ్మ కాలనీలో తల్లి వద్ద ఉంటున్న నాగరాజు భార్య కృష్ణకుమారి (34), కుటుంబ సమస్యల కారణంగా ఇంటి వద్ద పురుగు మందు తాగింది. గత కొంతకాలంగా భర్తతో మనస్పర్థలు ఏర్పడడంతో ఆమె తల్లి వద్ద ఉంటోంది. ఈ క్రమంలో గురువారం తీవ్ర మనస్తాపంతో ఆత్మహత్యకు యత్నించింది. గమనించిన కుటుంబ సభ్యులు ఆమెను వెంటనే ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి తరలించారు. బాబు కాలనీకి చెందిన రమేష్ భార్య ధనలక్ష్మి (30), రుణ ఒత్తిడి భరించలేక థైరాయిడ్ మాత్రలు మింగింది. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి తరలించారు. సంబంధిత పోలీసులు కేసులు విచారణ చేస్తున్నారు.

త్వరలో అన్నమాచార్య విశ్వవిద్యాలయం ఆవిర్భావం



మాట్లాడుతున్న చొప్పా అభిషేక్‌రెడ్డి

రాజంపేట : రాజంపేటలో అన్నమాచార్య యూనివర్సిటీ త్వరలో ఆవిర్భవించనుందని అన్నమాచార్య యూనివర్సిటీ (ఏయూ) ప్రతినిధి, ఏఐటీఎస్ ఈడీ చొప్పా అభిషేక్‌రెడ్డి అన్నారు. గురువారం అన్నమాచార్య ఫార్మసీ అటానమస్ కళాశాలలో స్పోర్ట్స్ మీట్ ఉత్సవాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రైవేటు యూనివర్సిటీలో భాగంగా రాజంపేటకు యూనివర్సిటీని మంజూరు చేసిందన్నారు. ఇందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలను తెలియచేశారు. అన్నమాచార్య యూనివర్సిటీ ఏర్పాటుకు సహకరించిన రాజంపేట ఎంపీ పీవీమిథున్‌రెడ్డితో పాటు ఉభయ జిల్లాల ప్రజాప్రతినిధులు ధన్యవాదాలు తెలిపారు. జిల్లాలో తొలిసారిగా విశ్వవిద్యాలయం ఏర్పాటు రాజంపేటకు వరం లాంటిందన్నారు. కార్యక్రమంలో ఏఐటీఎస్ వైస్‌చైర్మన్ చొప్పా ఎల్లారెడ్డి, అన్నమాచార్య ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ స్వర్ణలత, ఫార్మసీ అధ్యాపకులు, విద్యార్థినీవిద్యార్థులు పాల్గొన్నారు. అంతకముందుగా స్పోర్ట్స్ మీట్ సందర్భంగా గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందచేశారు. విద్యతో పాటు క్రీడల్లో కూడా రాణిస్తే ఉజ్వలభవిష్యత్తు ఉంటుందని చొప్పాఅభిషేక్‌రెడ్డి స్పోర్ట్స్‌మీట్ సభలో పిలుపునిచ్చారు.

మనోవేదనతో వ్యక్తి ఆత్మహత్య

కడప అర్బన్ : కడప నగరంలోని రిమ్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో వడ్డెర కాలనీలో నివాసం వుంటున్న పొన్న రెడ్డి ప్రసాద్ (37) అనే వ్యక్తి బుధవారం రాత్రి ఇంటిలో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి తల్లి బాలమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు వివరాలిలా ఉన్నాయి. రెడ్డి ప్రసాద్ కడప నగర శివార్లలోని వడ్డెర కాలనీలో నివాసం వుంటున్నాడు. అతని భార్య సుప్రజ జీవనోపాధి నిమిత్తం గల్ఫ్‌కు వెళ్లింది. తనకున్న రెండు సంవత్సరాల పాపను పుట్టింటిలో వదిలి వెళ్లింది. ఒంటరిగా ఉంటున్న రెడ్డి ప్రసాద్ తాను కూడా కువైట్‌కు వెళ్లాలనీ అనుకుంటున్నట్లు తన తల్లితో పలుమార్లు చెప్పాడు. తన భార్య దూరం కావడంతో మనోవేదనకు గురయ్యాడు. కుటుంబసభ్యులు లేని సమయంలో ఈ చర్యకు పాల్పడ్డాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలియజేశారు.

తాగి వాహనాలు నడిపిన వారికి జరిమానా

మదనపల్లె : తాగి వాహనాలు నడిపిన 11 మందికి రూ.1.22 లక్షలు జరిమానా విధిస్తూ మదనపల్లె స్పెషల్ జుడిషియల్ సెకండ్ క్లాస్ న్యాయమూర్తి ప్రవీణ్‌కుమార్ గురువారం తీర్పు చెప్పారు. పట్టణంలోని ఒకటో పట్టణ పోలీసుస్టేషన్ పరిధిలో సీఐ వల్లిబసు మద్యం తాగి వాహనాలు నడుపుతున్న ఐదుగురిని అరెస్టు చేశారు. రెండో పట్టణ పోలీసుస్టేషన్ పరిధిలో సీఐ యువరాజ్ ఆరుగురిని అరెస్టు చేశారు. వీరిని గురువారం కోర్టుకు హాజరుపరచగా న్యాయమూర్తి జరిమానా విధించారు. జరిమానా చెల్లించకుంటే మూడు నెలలు జైలు శిక్ష అనుభవించాలని తీర్పులో పేర్కొన్నారు. మొదటి తప్పు కింద జరిమానా వేస్తున్నామని, మరోసారి మద్యం తాగి వాహనాలు నడిపితే జైలుకు పంపుతామని న్యాయమూర్తి హెచ్చరించినట్లు సీఐలు తెలిపారు.

ఎంపీగా అభివృద్ధికి తోడ్పాటు

మేడా రఘునాథరెడ్డి



ఉపరాష్ట్రపతి, మంత్రి గోయల్‌తో ఎంపీ మేడా రఘునాథరెడ్డి, ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి

రాజంపేట : రాజ్యసభ సభ్యుడిగా అభివృద్ధికి తన వంతుగా తోడ్పాటును అందిస్తానని రాజ్యసభ సభ్యుడు మేడా రఘునాథరెడ్డి చెప్పారు. గురువారం పార్లమెంట్‌లో రాజ్యసభ చైర్మన్ జగదీప్ ధంకర్ సమక్షంలో రఘునాథరెడ్డి రాజ్యసభ సభ్యుడిగా ప్రమాణస్వీకారం చేశారు. అనంతరం ఉపరాష్ట్రపతిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజ్యసభ సభ్యుడిగా తనకు పనిచేసే అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలను తెలియచేశారు. అలాగే వైఎస్సార్, అన్నమయ్య జిల్లాల పరిధిలో కేంద్రంవైపు నుంచి చేయాల్సిన అభివృద్ధికి కృషిచేస్తానన్నారు.ఉభయ జిల్లాలో నందలూరు రైల్వేకు ప్రత్యేక గుర్తింపు ఉందని, ఆ రైల్వేకేంద్రానికి పూర్వవైభవం తీసుకొచ్చేందుకు ఎంపీ మిథున్‌రెడ్డితో కలిసి కృషిచేస్తానన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మళ్లీ అధికారంలోకి రావడం తథ్యమన్నారు. మేడా రఘునాథరెడ్డి ప్రమాణస్వీకారానికి ఎమ్మెల్యే మేడామల్లికార్జునరెడ్డి, నందలూరు మండలాధ్యక్షుడు మేడా విజయభాస్కర్‌రెడ్డి, ఎమ్మెల్యే సోదరుడు మేడా మధుసూదనరెడ్డి వెళ్లారు.

వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరికి గాయాలు



తీవ్రంగా గాయపడిన జహీరాబీ, పురుషోత్తం

మదనపల్లె : వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరు వ్యక్తులు గాయపడి, స్థానిక ప్రభుత్వ జిల్లా ఆసుపత్రిలో చికిత్సలు పొందుతున్నారు. కురబలకోట మండలం అంగళ్లు ఇందిరానగర్ కు చెందిన జహీరాబీ (70) ఇంటి సమీపంలోనే సంత జరుగుతుండగా, టమాటాలు కొనేందుకు వెళ్లింది. రోడ్డు పక్కన దుకాణంలో టమాటాలు తీసుకుంటుండగా వేగంగా వచ్చిన ఆటో ఆమెను ఢీకొంది. ప్రమాదంలో జహీరాబీ తీవ్రంగా గాయపడగా స్థానికులు ఆమెను మదనపల్లి ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి తరలించారు. పెద్దపంజాణి మండలం ముత్తుకూరు గ్రామానికి చెందిన అమర్నాథ్ కుమారుడు పురుషోత్తం (20) పుంగనూరు నుంచి చౌడేపల్లి కు ద్విచక్ర వాహనంలో వెళ్తుండగా, ఏడూరు వద్ద ఎదురుగా వెళుతున్న మరో ద్విచక్ర వాహనం యూటర్న్ తీసుకోవడంతో, అదుపుతప్పి కింద పడి తీవ్రంగా గాయపడ్డాడు. గమనించిన స్థానికులు బాధితున్ని మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి తరలించారు.

వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరు మృతి

జిల్లాలో గురువారం వేర్వేరు ప్రాంతాల్లో జరిగిన రోడ్డుప్రమాదాల్లో ఇద్దరు మృతి చెందారు. కారు,బైక్ ఢీకొనడంతో ఒకరు, ఐషర్ వాహనంపై నుంచి కిందపడి మరొకరు మృతి చెందారు.

కారు, బైక్ ఢీ కొని..



మృతి చెందిన చంటయ్య

చాపాడు : మండల కేంద్రమైన చాపాడు సమీపంలో కుందూనది దగ్గర బుధవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో పందిటి చంటయ్య(56) మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు..మైదుకూరు మండలం నానుబాలపల్లెకు చెందిన పందిటి చంటయ్య(56)బైక్‌లో వెళుతుండగా ఇదే క్రమంలో కడపకు చెందిన కారు బైక్‌ను ఢీ కొంది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన చంటయ్యను 108 వాహనంలో ప్రొద్దుటూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం కర్నూలుకు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం రాత్రి చంటయ్య మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు, ఇద్దరు కూతుర్లు ఉన్నారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వాహనంపై నుంచి కిందపడి



నగేష్‌రెడ్డి(ఫైల్)

ముద్దనూరు : మండలంలోని కొర్రపాడు గ్రామ సమీపంలో ఐషర్ వాహనం నుంచి కింద పడి క్లీనరు నగేష్‌రెడ్డి(32)అనే యువకుడు మృతి చెందాడు.సీఐ దస్తగిరి కథనం మేరకు అనంతపురం జిల్లా బెలుగుప్ప మండలం నక్కలపల్లె గ్రామానికి చెందిన న గేష్‌రెడ్డి ఐషర్ క్లీనరుగా పనిచేస్తున్నాడు.గురువారం చీనీకాయల లోడు కోసం పాత కొర్రపాడు గ్రామ రహదారిలో ఐషర్ వాహనంలో వెనుకవైపున నగేష్‌రెడ్డి ప్రయాణిస్తున్నాడు. ఐషర్ వాహనాన్ని భాస్కర్‌రెడ్డి అజాగ్రత్త నడపడంతో వాహనం గుంతలో పడి ఎగిరింది.దీంతో వెనుకవైపు వున్న నగేష్‌రెడ్డి వాహనంలో నుంచి ఎగిరి కింద పడటంతో అతని తలకు తీవ్ర గాయమైంది.క్షతగాత్రున్ని చికిత్స నిమిత్తం ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం కర్నూలుకు తరలిస్తుండగా మార్గమధ్యంలో నగేష్‌రెడ్డి మృతి చెందాడు.

నవోదయ ఫలితాల్లో విశ్వం విద్యార్థుల ప్రభంజనం





తిరుపతి కల్చరల్ : జాతీయ స్థాయిలో 2024–25 విద్యా సంవత్సరానికి జరిగిన జవహర్ నవోదయ విద్యాలయ పరీక్ష ఫలితాల్లో విశ్వం విద్యార్థులు ఉత్తమ ప్రతిభతో ప్రభంజనం సృష్టించినట్లు కోచింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్ర ఉపాధ్యక్షుడు, విశ్వం విద్యాసంస్థల అధినేత ఎన్.విశ్వనాథ్‌రెడ్డి తెలిపారు. ఈ ఫలితాల్లో పి.గంగా జైదీప్‌రెడ్డి, లాస్య, ఎన్.లిఖిత, పి.ఉదయశ్రీ, జి.లక్ష్మి, ఎన్.కేతన్ భాస్కర్, ఎన్. జ్యోష్ణ, ఏ.గౌతం కుమార్, హేమంత్, కేథన్ తదితరులతో పాటు 39 మంది విశ్వం విద్యార్థులు ఉత్తమ ఫలితాలతో నవోదయ పాఠశాలల్లో సీట్లు సాధించడం గర్వకారణమని తెలిపారు. ఈ సందర్భంగా ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను విశ్వం విద్యాసంస్థల అధినేత ఎన్.విశ్వనాథ్ రెడ్డి, అకడమిక్ డైరెక్టర్ ఎన్.విశ్వచందన్‌రెడ్డి, కరస్పాండెంట్ ఎన్.తులసీ విశ్వనాథ్‌లు అభినందించారు. ఈ సందర్భంగా ఎన్.విశ్వనాథ్‌రెడ్డి మాట్లాడుతూ గత 34 ఏళ్లుగా జాతీయ స్థాయిలో జరిగే సైనిక్, నవోదయ, మిలిటరీ స్కూల్స్ వంటి పోటీ పరీక్షలకు తమ సంస్థలో శిక్షణ ఇస్తూ జాతీయ స్థాయిలో ఉత్తమ ఫలితాలతో పాటు అత్యుత్తమ మార్కులు, ర్యాంకులును విశ్వం విద్యార్థులు సాధిస్తున్నట్లు తెలిపారు.

నాకు టికెట్ వచ్చేలా పూజలు చేయండి



పొత్తపిలో టీడీపీ ఇన్‌చార్జి బత్యాల

నందలూరు(రాజంపేట) : చంద్రబాబు మనసు మారి, తనకు టికెట్ వచ్చేలా పొత్తపి మూలస్థానేశ్వర స్వామికి పూజలు చేయండి అంటూ రాజంపేట టీడీపీ ఇన్‌చార్జి బత్యాల చెంగల్రాయుడు ప్రజలను కోరారు. అన్నమయ్య జిల్లాలో వెలసిన మట్లిరాజుల కాలం నాటి మూలస్థానేశ్వరస్వామిని ఆయన గురువారం దర్శించుకున్నారు. అనంతరం గ్రామస్తులతో మాట్లాడుతూ తన మనసులో ఉన్న మాటను వారికి చెప్పుకున్నారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ రాయచోటి టికెట్ సుగవాసి బాలసుబ్రహ్మణ్యానికి ఇచ్చి, తనకు రాజంపేట టికెట్ ఇస్తే అత్యధిక మెజార్టీతో గెలుస్తానని ప్రజల వద్ద చెప్పుకున్నారు.


గండిమడుగులో పడి వ్యక్తి మృతి



గంగులప్ప మృతదేహం

గాలివీడు : మండల పరిధి వెలిగల్లు గ్రామం గండిమడుగులో వ్యక్తి మృతి చెందిన సంఘటన గురువారం చోటు చేసుకుంది. గుర్రాలమిట్టకు చెందిన గంగులప్ప(50) మతిస్థిమితం లేక సమీపంలోని గండిమడుగు నీటిలో పడి మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. మండల ఎస్‌ఐ వెంకటప్రసాద్‌కు ఫోన్ ద్వారా సమాచారం అందించారు. ఆయన పోలీసు సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకున్నారు. మృతదేహానికి నీటిమడుగులో నుంచి వెలికి తీశారు., కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

అంతు చిక్కని వ్యాధితో పాడి ఆవుమృతి



మృతిచెందిన పాడిఆవు.

రామసముద్రం : అంతుచిక్కని వ్యాధితో పాడి ఆవు మృతి చెందింది. నాలుగు రోజుల క్రితం పాడి ఆవు వెనుక కాలు తొడ భాగాన వాపురావడంతో ఊలపాడు గ్రామానికి చెందిన రైతు చిన్నరెడ్డెప్పరెడ్డి వైద్యం చేయించారు. అయినా నయం కాకపోవడంతో రెండు రోజుల కిందం 1962 అంబులెన్స్‌కు సమాచారం అందించాడు. అంబులెన్స్ వైద్యులు ఆవును పరిశీలించి వైద్యం అందించి వెళ్లారు. అయినప్పటికి పాడి ఆవుకు వ్యాధి నయంకాక మృతి చెందింది. దీంతో రైతు ఆర్థికంగా నష్టపోయానని బోరున విలపిస్తున్నాడు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నాడు.